# ప్రశ్నలు & సమాధానాలు

## ప్రశ్న 349, ఇప్పుడు స్వామి ఎక్కడ ఉన్నారు?
**జనవరి 30, 2025**

ఈ ఉద్ధరణ ప్రొ. అనిల్ కుమార్ గారి *Seeking Within,* పేజీలు *104-108* నుండి తీసికొనబడినవి.

ప్రొ. అనిల్ కుమార్ గారు భగవాన్ బాబా వారి సందేశము, ఉపదేశములను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పడానికి ఎంపిక చేయబడ్డారు. భారత దేశంలోను, ఇతర దేశాలలోను కూడా విస్తారముగా తిరిగి ఎంతో మంది భక్తులు అడిగిన ప్రశ్నలు, సందేహాలు స్వామి చెప్పిన వాక్కులు, ఉపన్యాసాలను మూలంగా తీసుకొని తేటతెల్లం చేసారు. ముఖ్యంగా ప్రొ. అనిల్ కుమార్ గారు మన సర్వాంతర్యామి సాయిని ఎలా చేరుకోవాలో మార్గం చూపుతారు.

ప్ర: బాబా ఎప్పుడు తిరిగి వస్తారు?

జ. ప్రొ. అనిల్ కుమార్: కొంత మంది 14 రోజులలో వస్తారంటారు. మరి కొందరు ఇంకొక సంవత్సరంలో తిరిగి వస్తారని అంటారు. "ఆయన ఎక్కడికీ వెళ్ళలేదు, కనుక తిరిగి ఎలా వస్తారు?" అంటాను నేను.

నా గురించి నేను "ఇక్కడికి వచ్చాను, కనుక తిరిగి వెళ్ళిపోతాను," అని చెప్పవచ్చు. కానీ ఆయన ఎక్కడి నుండి రాలేదు. సర్వత్రా ఉన్నారు! కనుక నా జవాబు, "ఆయన ఎక్కడికీ వెళ్ళలేదు, కనుక తిరిగి ఎలా వస్తారు?" అంటాను నేను.

ప్ర: స్వామి దేహం చాలించినా అన్ని కార్యక్రమాలు ఎప్పటి వలె కొనసాగుతాయా?

జ. ప్రొ. అనిల్ కుమార్: కార్యక్రమాలు కొనసాగడమే కాక మునుపు కంటే రెట్టింతలౌతాయి. ఎందుకంటే బాబా భౌతిక శరీరం కాదు. మరి ఎవరు? ఆయన శక్తి. ఆయన అంతర్యామి. ఆయన మనను ప్రోత్సహించి, స్ఫూర్తిని ఇచ్చేవారు. అవన్నీ చేసే శక్తి ఆయన.

ఆయన చెప్పే ఉదాహరణ: బల్బు మనకి కాంతిని ఇస్తుంది. ఎందుకు ప్రకాశిస్తుంది? దానిలో కరెంటు ప్రవహిస్తుంది కనుక. అందులోని ఫిలమెంట్ కాలిపోతే బల్బు పనికిరాదు. కానే కరెంటు ప్రవహిస్తూనే ఉంటుంది. బల్బు తీసివేసినా కూడా కరెంటు ప్రవహిస్తూనే ఉంటుంది.

కనుక బాబా కరెంటు వలె ఎప్పుడూ ఉంటారు, భౌతిక శరీరం ఉన్నా లేకున్నా. కరెంటు వలె ఎప్పుడూ ఉంటారు. కనుక మన కార్యక్రమాలు ఏమీ తక్కువ అవ్వవు. అందులో సంశయం అక్కరలేదు.

ప్ర: బాబా వారి చివరి ఉపదేశం ఏమిటి?
జ. ప్రొ. అనిల్ కుమార్: భగవంతునికి మొదటి ఉపదేశం, చివరి ఉపదేశం అంటూ ఉండవు. ఆయన ఉపదేశం నిత్యసత్యమైనది. భగద్గీత మొదటి ఉపదేశమా చివరి ఉపదేశమా? నిత్యసత్యమైన ఉపదేశం! అదే విధంగా స్వామి వారి మొదటి ఉపదేశమే చివరి ఉపదేశం కూడా.

బాబా వారి ఉపదేశం ఒక్క వాక్యంలో చెప్పాలంటే, Love is God. God is Love. సూర్యచంద్రులు ఆకాశంలో ప్రకాశించినంత వరకూ ఈ ఉపదేశం కొనసాగుతూనే ఉంటుంది!

ప్ర: స్వామి వారి దేహచాలన వల్ల ప్రశాంతి నిలయం పై ప్రభావం ఏమిటి?

జ. ప్రొ. అనిల్ కుమార్: బాబా వారు గానీ, అవతారాల గురించి గానీ "చనిపోవుట" అనే పదం వాడకూడదు. మనం చనిపోతాం కానీ వారు భౌతిక శరీరాన్ని చాలిస్తారు.

మీ ప్రశ్నకి జవాబు, ఏ ప్రభావం ఉండదు. అన్ని కార్యక్రమాలు మునుపు వలె జరుగుతూ ఉన్నాయి. నగరసంకీర్తన, భజనలు ఎప్పటి వలె జరుగుతున్నాయి. ప్రశాంతి నిలయం వదిలి ఎవరూ వెళ్ళిపోలేదు.

అంతే కాక పాలరాతికి బంగారు అంచు ఉండే మహాసమాధి కట్టబడింది. బాబా వారి పుట్టుపండుగకు ధరించే వస్త్రం వలె ఉంది. సమాధి అంటే ఏమిటి? బాబా వారు విశ్రాంతి తీసుకునే స్థలం. అక్కడ విశ్రాంతి తీసుకొని ఆయన పిల్లలను చూసుకుంటున్నారు.

ప్ర: నాకు పర్తికి వెళ్లాలని ఉంది కానీ నా భార్య స్వామి అక్కడ లేరు అంటుంది.

జ. ప్రొ. అనిల్ కుమార్: ఓహో! మిగతా వారి కంటే వ్యతిరేక రీతిలో ఉన్నారు మీరు. భర్త స్వామి ఉన్నారంటే భార్య స్వామి లేరు అంటున్నారు. ఇదే సంసారం లోని అందం. ఇద్దరు ఎప్పుడూ అంగీకారంలో ఉంటే జీవితం ఆసక్తికరంగా ఉండదు. వ్యతిరేకం ఉండాలి. జీవితమే ఒక విసమతం. పగలు, రాత్రి వలె వ్యతిరేకాలు కలిసి ప్రయాణిస్తాయి. భార్య ఒకటి చెప్తే భర్త ఇంకొకటి అంటాడు. మర్నాడు అంగీకారమో, వ్యతిరేకమో. ఇదే సంసారమంటే.

ప్ర: ఇప్పుడు స్వామి భౌతిక శరీరం చాలించారు కనుక ఆయన విగ్రహానికి అభిషేకం చేయవచ్చా?

జ. ప్రొ. అనిల్ కుమార్: ఈ ప్రశ్నలో ఉన్న అంశం ఒక దానిని నేను అంగీకరించను. స్వామి శరీరం చాలించారు అంటున్నారు కానీ స్వామి చెప్పారు, "నీవు నీ దేహం కాదు," అని. కనుక ఆయన దేహం ఎలా అవుతారు? చావు తర్వాత దేహం చాలించాలి, నిజమే. దానిని ఎవ్వరూ తప్పించుకోలేరు.

స్వామి దేహం చాలించారు అంటే అది మన గమనిక, అంతే. అది భౌతిక, లౌకిక, బాహ్య పరమైన విషయం. "స్వామి దేహాన్ని చాలించారు," అనడం సబబు.
కనుక ఆయన విగ్రహానికి అభిషేకం చేసుకోవచ్చా? విగ్రహం అనేది దేహం కాదు. మీలో చాలా మందికి లింగం అంటే ఏమిటో తెలిసే ఉంటుంది. అది దైవత్వానికి చిహ్నం. లింగానికి అభిషేకం చేస్తాం. అందులో తప్పు లేదు.

అలాగే ఆయన విగ్రహానికి కూడా అభిషేకం చేయవచ్చు. ఆయన భౌతిక శరీరానికి ఎవరూ అభిషేకం చేయలేదనుకుంటా. ఆయన విగ్రహానికి అభిషేకం చేసినప్పుడు ఆయనను శివునితో, శివలింగంతో పోల్చుకుంటున్నారు. అది విగ్రహం అని తెలిసి, ఆ విగ్రహం ద్వారా ఇష్టదైవం చేరుకుంటున్నారు. విగ్రహం నుండి దైవానికి చేరుకోవడమే అభిషేకం యొక్క లక్ష్యం కనుక అందులో తప్పు లేదు.

ప్ర: ఈ నడుమ చాలా మంది స్వామి వారి ఇళ్ళల్లో ఉన్నానని చెప్పారని అంటున్నారు. కొంతమంది భక్తులని కూడా వారి ఇళ్ళకు ఆహ్వానిస్తున్నారు. అంటే స్వామి పుట్టపర్తిలో లేరని అర్థం. అయితే స్వామి ఎక్కడ ఉన్నారు**?**

జ. ప్రొ. అనిల్ కుమార్: ఆహ్! చాలా మంది స్వామి వారి ఇళ్ళలో ఉన్నారని చెప్తున్నారంటే వారు మూర్ఖులు. ఎందుకంటే స్వామి వారి ఇళ్ళలో ఎప్పుడూ ఉన్నారు. ఇప్పుడు అంటున్నారు అంటే వారు ఇప్పుడే తెలుసుకున్నారు. స్వామి మన ఇళ్ళల్లో ఎప్పుడూ ఉంటారు. ఇది చెప్పుడు మాట కాదు. ఇది సత్యం. ఆయన సర్వవ్యాపి.

కొందరు వారి ఇళ్ళకు ఆహ్వానిస్తున్నారు. "మా ఇంటికి వచ్చి బాబాను చూడండి," అంటే ఆయన ప్రదర్శనలలో చూపే బొమ్మ కాదు! "అనిల్ కుమార్, మా ఇంట్లో కొత్త ఫ్లోరింగ్ వచ్చి చూడండి," అన్నట్లు. ఎందుకు వెళ్ళాలయ్యా?

మా ఇంట్లో మంచి భోజనం, పచ్చడి తయారుగా ఉన్నప్పుడు ఎవరో వారి ఇంటికి ఆహ్వానిస్తే నేనే వెళ్తే, ఎవరు మూర్ఖుడు? నన్ను పిలిచిన వాడు కాదు. నేనే మూర్ఖుడిని, ఇంట్లో ఉన్న మంచి భోజనం వదిలి వెళ్ళడానికి. వారు పిలువవచ్చు కానీ నేను ఎందుకు వెళ్ళాలి?

అదే విధంగా, వారి ఇంట్లో భగవంతుడిని చూడడానికి పిలిచారంటే మన ఇంట్లో భగవంతుడు లేడని అర్థం. కానీ భగవంతుడు ఒక చోటులో ఉండి మరొక చోటులో లేడు అని చెప్పడానికి లేదు. భగవంతుడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. కనుక ఇవి ఆధ్యాత్మిక ప్రశ్నలు కాదు. అవివేకం, అజ్ఞానంతో కూడిన ప్రశ్నలు.

"భగవంతుడు నాతో కూడా ఉన్నాడు," అని ఆత్మవిశ్వాసంతో చెప్పవచ్చు. ఆయన తరచూ చెప్పేవారు, "భగవంతుడు నీ ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉన్నాడు," అని.

మరిన్ని ఆధ్యాత్మిక ఉపదేశములతో మళ్ళీ కలుద్దాం. ధన్యవాదములు.

ఓం సాయి రామ్